ఆత్మగౌరవాన్ని గెలిపించండి

బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి సునీల్‌రెడ్డి



ముప్కాల్‌లో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి



వన్నెల్(బి)లో హాజరైన ప్రజలు

బాల్కొండ: అహంకారాన్ని ఓడించి, ఆత్మగౌరవాన్ని గెలిపించాలని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సునీల్‌రెడ్డి కోరారు. బుధవారం బాల్కొండ మండలం వన్నెల్(బి)లో, ముప్కాల్ మండల కేంద్రంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పోరాటాలతో సాధించుకున్న తెలంగాణాలో ఆత్మగౌరవానికి, అహంకారానికి మధ్య పోరాటాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఏ ఆకాంక్షల కోసం తెలంగాణ సాధించుకున్నామో.. ఆ ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. తాను గెలిస్తే బాల్కొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముస్కు ముత్తెన్న, దేవేందర్, రఘుపతి పాల్గొన్నారు.

సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

- బోధన్ బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్

ఎడపల్లి: ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయమని బోధన్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే షకీల్ అన్నారు. మండలంలోని అంబం(వై), బ్రాహ్మణపల్లి, జైతాపూర్, ఎంఎస్‌సీ ఫారం, ఓడ్డెపల్లి, ధర్మారం, జంలం గ్రామాల్లో ఆయన బుధవారం ప్రచారం చేశారు. 70 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితయాదవ్, ఎడపల్లి సర్పంచ్ ఆకుల మాధవి, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీరాం, నాయకులు యాదవ్, ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



జైతాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షకీల్

బోధన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- బోధన్ బీజేపీ అభ్యర్థి వడ్డీ మెహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మెహన్‌రెడ్డి



మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

బోధన్‌రూరల్: బీజేపీ ప్రభుత్వంతోనే బడుగు, బలహీనవర్గాలకు మేలు జరుగుతుందని బోధన్ బీజేపీ అభ్యర్థి వడ్డీ మెహన్‌రెడ్డి అన్నారు. సాలూర మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామల ప్రజలకు బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. పార్టీ శ్రేణులు మోహన్‌రెడ్డికు ఘన స్వాగతం పలికి పూలమాలతో సన్మానించాయి. ఆయన మాట్లాడుతూ బోధన్‌లో బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. మండలాధ్యక్షుడు ప్రవీణ్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమం బీజేపీతోనే సాధ్యం

- ఆర్మూర్ బీజేపీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి



మాక్లూర్‌లో మాట్లాడుతున్న రాకేశ్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో రాకేశ్‌రెడ్డి

మాక్లూర్: పేదల సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని ఆర్మూర్ బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాక్లూర్‌లో ప్రచారం చేశారు. తొమ్మిదిన్నరేళ్లుగా బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా పేదలకు ఎలాంటి మేలు చేయలేదని విమర్శించారు. చెప్పిన మాటలు నమ్మి రెండుసార్లు గెలిపిస్తే స్థానిక ఎమ్మెల్యే తన కార్యకర్తలను తప్ప ఎవరిని పట్టించుకోలేదని ఆరోపించారు. వందల కోట్లు వెచ్చించి సిద్దుల గుట్టను అభివృద్ధి చేశానని చెప్పుకుంటున్న బీఆర్ఎస్ అభ్యర్థి, వ్యక్తిగత ప్రయోజనాన్ని ఆశించే ఆ పని చేశారన్నారు. సిద్దుల గుట్టను అభివృద్ధి చేసే క్రమంలో మరో గుట్టను ఖాళీ చేశారని ఆరోపించారు. ఆ స్థలం ఇప్పుడు బీఆర్ఎస్ అభ్యర్థి కబ్జాలోకి వెళ్లిందన్నారు. బీజేపీకి ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు సురేష్ నాయక్, గంగోని సంతోష్, గోవురు ఒడ్డెన్న పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

నందిపేట్: నందిపేట్ గ్రామానికి చెందిన మున్నూరు కాపు ఐదు పంథాకు చెందిన 200 మంది సభ్యులు రాకేశ్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన కండువా కప్పి స్వాగతం పలికారు. బీసీ ముఖ్యమంత్రి నినాదంతో బీజేపీలోకి వలసలు పెరిగాయని చెప్పారు. నందిపేట్ గ్రామ యువత మొత్తం బీజేపీకే మద్దతు ఇస్తుందని, యువతకు ఉపాధి చూపించే బాధ్యత తనది అన్నారు. ఆర్మూర్‌లో బీజేపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ప్రశాంత్‌రెడ్డి అవినీతిపరుడు

- బాల్కొండ బీజేపీ అభ్యర్థి అన్నపూర్ణమ్మ

బాల్కొండ: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అవినీతిపరుడని బాల్కొండ బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ ఆరోపించారు. బుధవారం బాల్కొండలో ఆమె ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఏర్గట్ల మండలం బట్టాపూర్ కంకర క్వారీలో రూ.250 కోట్లను ప్రశాంత్‌రెడ్డి అక్రమంగా సంపాదించారన్నారు. ఆయన సోదరుడు నియోజకవర్గంలో గంజాయిని పెంచి పోషించారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు గెలిస్తే పార్టీ మరేది లేదని ముందు గ్యారెంటీ ఇవ్వాలన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే పేదలందరికీ న్యాయం చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, మండలాధ్యక్షుడు అంబటి నవీన్ పాల్గొన్నారు.



బాల్కొండలో మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

పోలీసు బలగాల మోహరింపు

బోధన్‌టౌన్(బోధన్) : జిల్లాలో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ రోజు పోలీసు బలగాలను మోహరించి భద్రత ఏర్పాటు చేస్తామని సీపీ కల్మేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం బోధన్ పట్టణంలో ఆచన్‌పల్లి, శక్కర్‌నగర్, రాకాసీపేట్, రెంజల్ బేస్ ప్రాంతాల్లో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. జిల్లాలో 650 పోలింగ్ కేంద్రాలున్నాయని, అందులో జిల్లావ్యాప్తంగా 173 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, ఇందులో బోధన్ డివిజన్‌లో 90, బోధన్ నియోజక వర్గ పరిధిలో 40 కేంద్రాలు ఉన్నాయన్నారు. పోలింగ్ జరిగే రోజు ఒక అడిషనల్ డీసీపీతో పాటు ఇద్దరు ఏసీపీలు, 4 సీఐలు, 8 మంది ఎస్సైలు, ప్రత్యేక బలగాలు అందుబాటులో ఉంటాయన్నారు. పోలింగ్ కేంద్రాలకు కొత్త నంబర్లు వేయాలన్నారు. సీపీ వెంట అడిషనల్ డీసీపీ జయరాం, ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ ప్రేమ్‌కుమార్ ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ

ఎమ్మెల్యే షకీల్‌పై ఫిర్యాదు



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతుకు బుధవారం బోధన్ ఎమ్మెల్యే షకీల్‌పై డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేతోపాటు అనుచరులు, పోలీసుల లాఠీచార్జిపై ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్ నాయకులు దాడులు చేయడం సరికాదన్నారు. ఎడపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పులి శ్రీనివాస్ మాట్లాడుతూ.. బోధన్ ఎమ్మెల్యే నుంచి నాకు రక్షణ కల్పించి, చర్యలు తీసుకోవాలని తెలిపారు.

కాంగ్రెస్ మాటలకు మోసపోవద్దు

- కేసీఆర్ సీఎంగా ఉంటేనే నీళ్లు, కరెంటు, పింఛన్లు
- రుణమాఫీని ఆపింది కాంగ్రెస్సే..
- బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి



పడగల్‌లో ప్రచారంలో పాల్గొన్న ప్రజలు



ఆర్ఆర్ నగర్‌లో మాట్లాడుతున్న మంత్రి వేముల

మోర్తాడ్/వేల్పూర్/కమ్మర్‌పల్లి: ఎన్నికల వేళ కాంగ్రెస్ మేనిఫెస్టో రూపంలో చూపుతున్న రంగుల ప్రపంచాన్ని చూసి మోసపోవద్దని మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని వేల్పూర్ మండలం పడగల్, వడ్డెరకాలనీ, మోర్తాడ్ మండలంలోని సంతోష్‌నగర్ కాలనీ, ఏర్గట్ల మండలం తోర్తి, కమ్మర్‌పల్లి మండలం ఆర్ఆర్‌నగర్‌లో బుధవారం ఆయన ప్రచారం చేశారు. సీఎం కేసీఆర్ చెప్పిందే చేస్తారు.. చేసేదే చెప్తారన్నారు. కానీ కాంగ్రెస్ సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేసేందుకు యత్నిస్తుందని విమర్శించారు. బీజేపీ కూడా మాయమాటలు చెబుతుందన్నారు. ఈ రెండు పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణలో ఉన్న పథకాలు ఒక్కటి కూడా అమలు కావడం లేదన్నారు. రుణమాఫీని ఆపిందని కాంగ్రెస్ వాళ్లేనన్నారు. మూడింట రెండొంతులు ఇప్పటికే మాఫీ చేశామని, మిగిలింది కూడా అయిపోతుందని చెప్పారు. తెలంగాణ రాకముందు కాంగ్రెస్ హయాంలో మంచినీళ్ల గోస, కరెంటు కష్టాలు ఎలా ఉండేవో ఒక్కసారి ఆలోచించాలని కోరారు. కుల సంఘాలకు ఇచ్చిన ప్రొసీడింగు కాపీలు, కొత్త రోడ్ల జీవోలు.. ఇవన్నీ ఎన్నికల కోసమేనని ఉత్త కాగితాలని కాంగ్రెస్ ఆరోపించడం వారి అజ్ఞానికి నిదర్శనమన్నారు. ఒక్కసారి ప్రభుత్వం నుంచి వచ్చిన ఆర్డర్ కాపీ ఉత్తదే ఎందుకవుతుందని, పనులు కొనసాగుతున్న తీరు ప్రజలకు చూస్తున్నారన్నారు. గృహలక్ష్మి పథకం కింద ఇప్పటికే ఆరు వేల మందికి మూడు లక్షల చొప్పున ప్రొసీడింగులను అందించామని తెలిపారు. సీఎంగా కేసీఆర్ వస్తేనే తాగు, సాగునీరు, కరెంటు, పింఛన్లు, సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కేసీఆర్‌తోనే తెలంగాణకు శ్రీరామరక్ష అన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

వేల్పూర్: వేల్పూర్, భీమ్‌గల్ మండలాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం వేల్పూర్‌లో మంత్రి ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పలు కుల సంఘాలు, యువజన సంఘాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంపూర్ణ మద్దతు తెలుపుతూ తీర్మానాలు చేసి మంత్రికి అందజేశారు. వేల్పూర్‌కు చెందిన డబుల్‌బెడ్‌రూం కాలనీవాసులు, వెంకటాపూర్‌కు చెందిన జక్కుల, ధనరెక్కుల, యాదవ సంఘాలు ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా తీర్మానం చేశాయి.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలో బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి సతీమణి నీరజారెడ్డి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రశాంత్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.



కమ్మర్‌పల్లిలో ప్రచారం చేస్తున్న నీరజారెడ్డి

అభివృద్ధికి నిదర్శనం ఆర్మూర్

- బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి



ఆర్మూర్‌లో ప్రచార సభకు హాజరైన ప్రజలు



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

ఆర్మూర్: ఆర్మూర్ పట్టణం అభివృద్ధికి నిదర్శనమని ఆర్మూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పట్టణంలోని 11, 12, 30, 31 వార్డుల్లో ఆయన ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయా వార్డుల ప్రగతి నివేదికలను ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో తనను గెలిపించాలని కోరారు. సిద్దులగుట్ట శివయ్య ఆశీస్సులు, ప్రజా అభిమానంతో మళ్లీ తానే గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఆర్మూర్ పట్టణ అభివృద్ధికి మరింత శ్రమిస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినిత, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రచారాస్త్రాలు

ఆర్మూర్: నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తన ప్రచారాస్త్రాలని ఆర్మూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్ మండలం చేపూర్‌లో బుధవారం ఆయన సమక్షంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. చేపూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి అనిల్ తోపాటు మహిళలు, కార్యకర్తలు గులాబీ కండువా కప్పుకున్నారు. ఆర్మూర్ నియోజకవర్గం అభివృద్ధిలో బీజేపీ, కాంగ్రెస్‌ల భాగస్వామ్యం లేదన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

నందిపేట్: ఆర్మూర్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి రజితరెడ్డి కోరారు. నందిపేటలో బుధవారం ఇంటింటికి వెళ్లి ఆమె ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ.. తమ కుటుంబానికి అభివృద్ధి, ప్రజా సంక్షేమం తప్ప మరో పనిలేదన్నారు. కేసీఆరే తెలంగాణకు రక్షణ కవచం అన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే బతుకులు గంగలో కలిసినట్లే అన్నారు. కాంగ్రెస్, బీజేపీలను తరిమికొట్టాలన్నారు. పదేళ్లగా నియోజకవర్గ అభివృద్ధి కోసం జీవన్‌రెడ్డి తన ప్రాణాన్ని పణంగా పెట్టాడని చెప్పా రు. అభివృద్ధి పరుగులు పెట్టాలంటే కారు గెలవాలన్నారు. ఉమ్మెడ-పంచగూడ వంతెనతో నందిపేట్ రూపురేఖలు మారాయని చెప్పారు. నందిపేట్‌లో బస్సు డిపో ఏర్పాటు చేసే దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. మళ్లీ బీఆర్ఎస్ వచ్చాక నందిపేట్ మున్సిపాలిటీ చేస్తామన్నారు.



నందిపేట్‌లో ప్రచారం చేస్తున్న రజితరెడ్డి

బీఆర్ఎస్‌ను గెలిపించాలి



బోధన్‌రూరల్: బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే షకీల్‌ను మూడోసారి భారి మెజారిటీతో గెలిపించాలని బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి కోరారు. సాలూర మండలంలో బుధవారం ఆమె ప్రచారం చేశారు. ఆడపడుచులకు బొట్టు పెట్టి కారు గుర్తు ఓటు వేయాలని కోరారు. సాలూర మండలం చేసిన షకీల్‌కు మండలంలోని గ్రామాల ప్రజలు ఓటు వేసి రుణం తీర్చుకోవాలన్నారు. ఎంపీటీసీ సవిత పాల్గొన్నారు.

ఏరాజ్‌పల్లిలో..

బోధన్ మండలం ఏరాజ్‌పల్లిలో ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ గిర్ధావర్ గంగారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేశారు. షకీల్‌ను గెలిపించాలని కోరారు. వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, నాయకులు బుద్దె రాజేశ్వర్ పాల్గొన్నారు.

కర్ణాటక కాంగ్రెస్ పథకాలపై మంత్రి అసత్య ప్రచారం



వేల్పూర్‌లో మాట్లాడుతున్న కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్

వేల్పూర్: కర్ణాటకలో కాంగ్రెస్ ప్రకటించిన పథకాలు అమలు చేయడం లేదని తెలంగాణ రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారని కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన వేల్పూర్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆందోళన నిర్వహించారు. కర్ణాటక గ్యారంటీలపై మంగళవారం మంత్రికి ఛాలెంజ్ విసిరానని, అందుకే ఆయన కోసం వేల్పూర్ వచ్చానన్నారు. ఆయన మాట్లాడుతూ తన సవాలను స్వీకరించని మంత్రికి కర్ణాటక హామీలపై మాట్లాడే హక్కు లేదన్నారు. కర్ణాటకలో కోటి 30లక్షల ఆడబిడ్డలకు నెలకు రూ.2 వేల చొప్పున ఇస్తున్నట్లు చెప్పారు. మహిళలందరికీ ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పించామన్నారు. తెలంగాణాలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అధికారంలోని వచ్చిన వంద రోజుల్లో అమలు చేస్తుందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి ప్రశాంత్‌రెడ్డిని తీసుకెళ్లి కర్ణాటకలో అమలవుతున్న పథకాలను ప్రత్యక్షంగా చూపిస్తానని, వారికి తీరిక లేకుంటే కేటీఆర్‌ను పంపాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు వేణుగోపాల్ యాదవ్, షెట్పల్లి నారాయణ, గడ్డం నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికల హక్కులపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

నవీపేట: మండలంలోని మోకన్‌పల్లి కేజీబీవీలో బుధవారం విద్యార్థులకు బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. రక్తహీనతతో కలిగే నష్టాలను వివరించారు. కష్టపడి చదువుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. డీడబ్ల్యూవో పీడీ రసూల్ జీ, సీడీపీవో స్వర్ణలత, డీఎంసీ స్వప్న, కేజీబీవీ ప్రత్యేకాధికారి రమ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న శిక్షణ



పెర్కిట్: ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో పీవో, ఏపీవోలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఆర్మూర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో వినోద్ కుమార్ ఎన్నికల విధులపై శిక్షణనిచ్చారు. ఆర్మూర్, మాక్లూర్, నందిపేట తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఆర్మూర్‌టౌన్: ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి వినోద్ కుమార్ సూచించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో 'ఓటు ఒక వజ్రాయుధం' ప్రచార రథాన్ని ఆయన ప్రారంభించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు గోపీకృష్ణ, తులసి, లక్ష్మీనారాయణ, కాంతి గంగారెడ్డి, పుష్కర్ రావు, దాము, శ్రీధర్, శశి, రాము, రాజు పాల్గొన్నారు.

లౌకికవాదులకు ఓటెయ్యాలి

ఆర్మూర్‌టౌన్: లౌకికవాదులకు ఓటు వేయాలని సీపీఎం జిల్లా కార్యాదర్శి రమేష్‌బాబు అన్నారు. పట్టణంలోని శాస్త్రీనగర్‌లో సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఇళ్ల స్థలాల కోసం అనేక ఏళ్లుగా సీపీఎం పోరాటం చేస్తుందన్నారు. పల్లపు వెంకటేష్, కుతాడి ఎల్లయ్య, కుల్దీప్‌శర్మ, నవీద్, నాగరాజు, ఓంకార్ సాయిలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం



బోధన్‌టౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఆ పార్టీ నాయకులు అన్నారు. బుధవారం పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రచారం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి, భద్రరావ్, బంటు సాయిలు, ఇంద్రకరణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



బోధన్‌రూరల్: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని మాజీ జెడ్పీటీసీ అల్లె లావణ్య అన్నారు. బుధవారం సాలూర మండలంలోని హున్సలో ఆమె ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ శంకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై దాడి శోచనీయం



నవీపేట: ప్రచారానికి వెళ్తున్న ఎమ్మెల్యే షకీల్‌పై జైతాపూర్‌లో దాడికి దిగడం శోచనీయమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. నవీపేటలో వారు బుధవారం మాట్లాడారు. పార్టీ మండలాధ్యక్షుడు నర్సింగ్‌రావు, ఎంపీపీ సంగెం శ్రీనివాస్, తెడ్డు పోశెట్టి, ప్రవీన్‌కుమార్, అల్లం రమేష్, లోకం నర్సయ్య, గంగాధర్, అలీమ్, ఒమర్, భూమయ్య, సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీకి మద్దతుగా ప్రచారం



మాక్లూర్: మాదిగలు అందరూ బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరుతూ బుధవారం ఎమ్మార్పీఎస్ ఆర్మూర్ నియోజకవర్గ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని ముత్యంపల్లి, ఒడ్డేటిపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. వర్గీకరణకు బీజేపీ అనుకూలంగా ఉన్నందున మాదిగలందరూ కమలం గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

మద్యం పట్టివేత

భీమ్‌గల్: అక్రమంగా కారులో తరలిస్తున్న మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ వేణుమాదవరావు తెలిపిన వివరాలు.. పట్టణ కేంద్రంలోని సుదర్శన్ థియేటర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో చేంగల్ గ్రామానికి చెందిన సురేందర్ మద్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. రూ.1.20 లక్షల విలువైన 576 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.